నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, మంగళవారం 4 ఫిబ్రవరి 2025 | VIKARABAD



బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## కాంగ్రెస్, బీజేపీలకు శంకరగిరి మాన్యాలే..

**కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**

**మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డుకు చెందిన బీజేపీ , కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిక..**

ఆమనగల్లు, ఫిబ్రవరి 3 : రానున్న స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు శంకరగిరి మాన్యాలే దిక్కని, బీఆర్ఎస్ అభ్యర్థులు గెలువడం ఖాయమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డుకు చెందిన చంద్రాయన్‌పల్లి పెద్ద తండా, చిన్న తండా, రామ్‌నగర్ తండాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ 3146 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనుల దశాబ్దాల కలను సాకారం చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని ఆయన గుర్తు చేశారు. గిరిజనుల జనాభా పెరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అనేక సమస్యలు సృష్టించినప్పటికీ రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచిన మహానేత కేసీఆర్ అని అన్నారు. గిరిజనుల కోసం బంజారాహిల్స్‌లో రూ. 24.68 కోట్లతో ఆదివాసీ భవన్, రూ.24.43 కోట్లతో బంజారాభవన్ నిర్మించిన ఘనత కేవలం బీఆర్ఎస్ పార్టీదేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 56 నియోజకవర్గాల్లో గిరిజన భవన్‌లు నిర్మించారన్నారు. ఇందులో భాగంగానే ఆమనగల్లు మున్సిపాలిటీలో సంత్ సేవాలాల్ గిరిజన భవన్ రూ.2.5 కోట్లతో నిర్మించినట్లు తెలిపారు. తండాలకు రోడ్లు వేయడం, ఎస్టీ గురుకులాల ఏర్పాటు వంటివి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయన్నారు. గిరిజనుల అభివృద్ధికి రూ.8750 కోట్లు ఎస్టీ సబ్‌ప్లాన్‌లో కేటాయించిందన్నారు. రానున్న స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి బీజేపీ, కాంగ్రెస్ నాయకులు వస్తే తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు తండాలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆయన ఎగురవేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్, మాజీ ఎంపీటీసీ దోనాదుల కుమార్, సీనియర్ నాయకులు ఎంగలి రఘు, గుత్తి బాలస్వామి, శ్రీనూనాయక్, నాయకులు కొమ్ము ప్రసాద్, రమేశ్‌నాయక్, వెంకటేశ్, గణేశ్, హేమ్లా నాయక్, కుమార్ నాయక్, పంతూనాయక్, నిరంజన్, జైపాల్, శ్రీకాంత్, శ్రీను, గోపాల్, మల్లేశ్ ఉన్నారు.



తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలుపుతున్న కాంట్రాక్టర్ దానయ్య

## బిల్లులు ఇవ్వలేదని తహసీల్దార్ కార్యాలయానికి తాళం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 3 : ఇబ్రహీంపట్నంలో జడ్పీ అతిథి గృహం నిర్మాణం పూర్తి చేసి రెండేండ్లు అవుతున్నది. ప్రస్తుతం అతిథి గృహంలో ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతున్నది. కానీ, కాంట్రాక్టర్‌కు మాత్రం బిల్లులు రాక ఉన్నతాధికారుల చుట్టూ తిరిగి వినతిపత్రాలను అందజేసినా ఫలితం దక్కలేదు. దీంతో పలుమార్లు ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. చేసేదేమీలేక సోమవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి, కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. నాలుగు సంవత్సరాల క్రితం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ.50 లక్షలతో జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని నిర్మించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు భవన నిర్మాణాన్ని చేపట్టారు. కానీ, నిధులు సరిపోకపోవడంతో మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. అదే సమయంలో పురాతనమైన తహసీల్దార్ కార్యాలయానికి సైతం పక్కా భవనం నిర్మించాలని ప్రభుత్వం నిధులు వెచ్చించింది. పాత భవనంలో కొనసాగిన తహసీల్దార్ కార్యాలయాన్ని తొలగించి, ఆ స్థానంలో నూతన భవన నిర్మాణం పూర్తయ్యే వరకు మరో భవనానికి తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చాలని గత ప్రభుత్వంలో నిర్ణయించి తహసీల్దార్ కార్యాలయాన్ని జడ్పీ అతిథి గృహంలోకి మార్చారు. రెండేండ్లుగా తహసీల్దార్ కార్యాలయ కార్యకలాపాలు అతిథి గృహంలోనే కొనసాగుతున్నాయి. కానీ, కాంట్రాక్టర్ దానయ్యకు మాత్రం బిల్లులు చెల్లించడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ఐదుసార్లు ఎస్టిమేట్స్ పంపిన అధికారులు
- అంచనాలు తప్ప మంజూరు కాని నిధులు
- పూర్తిగా దెబ్బ తిన్న కోట్‌పల్లి ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలు
- మరమ్మతులు చేయకపోవడంతో తక్కువ విస్తీర్ణానికే సాగునీరు
- ఏటా ప్రాజెక్టులో సమృద్ధిగా నీరుంటున్నా వాడుకోలేక నష్టపోతున్న రైతులు
- యాసంగిలో 2 వేల ఎకరాలకూ సాగునీరు ఇవ్వడం కష్టమంటున్న అధికారులు
- మరమ్మతులు పూర్తైతే 9200 ఎకరాలకు అందనున్న సాగునీరు



వానకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసినప్పుడు అలుగుపారుతున్న కోట్‌పల్లి ప్రాజెక్టు

# యాసంగికి.. సాగునీరు రానట్టే..!

**జిల్లాలోని ఒకే ఒక్క ప్రాజెక్టు అయిన కోట్‌పల్లి ప్రాజెక్టులో సమృద్ధిగా నీరున్నా సాగుకు వాడుకోలేని దయనీయ పరిస్థితి నెలకొన్నది.** గత 3-4 ఏండ్లుగా వర్షాలు సమృద్ధిగా కురవడంతో కోట్‌పల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలు మెండుగా ఉన్నాయి. ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకపోవడంతో నీరు వృథాగానే ఉండిపోతుంది. 50 ఏండ్ల క్రితం నిర్మించిన కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువలు పూర్తిగా దెబ్బతినడం, తూములు కొట్టుకుపోవడం, బ్రిడ్జిలు కూలిపోవడంతో ఈ ప్రాజెక్టులో నీరున్నా ఆయకట్టుకు సాగు నీరందించని పరిస్థితి ఉన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం చివరి బడ్జెట్‌లో కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునికీకరణకు నిధులివ్వడంతో అంచనాలు పూర్తి చేసి ప్రభుత్వానికి అధికారులు అందజేసిన అనంతరం నిధులు విడుదల దశలో ఎన్నికలు రావడంతో ఆగిపోయింది. తదనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునీకీకరణ ఊసే లేకపోవడం గమనార్హం. స్థానిక ప్రజల ఒత్తిడితో అంచనాలను రూపొందించాలని స్థానిక ప్రజాప్రతినిధులు చెబుతున్నప్పటికీ ఇప్పటివరకు నిధులు మంజూరు చేయించలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఇప్పటికే ఐదుసార్లు అంచనాలను రూపొందించి అధికారులు ప్రభుత్వానికి అందజేశారు. అయినప్పటికీ నిధుల మంజూరుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. దీంతో ఈ యాసంగికి కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి సాగునీరు ఇవ్వడం కష్టమేనని సంబంధిత అధికారులు తేల్చిచెబుతున్నారు. జిల్లా రైతాంగానికి సాగునీరిచ్చే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు లేకపోవడంతోనే నిధుల విడుదలలో జాప్యం జరుగుతుందంటూ రైతులు విమర్శిస్తున్నారు.

- వికారాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ)

### కాలువలు పాడైనయ్..

జిల్లాలో ప్రాజెక్టులు, ప్రధాన చెరువుల నుంచి వెళ్లే కాలువలు పూర్తిగా పాడై సాగు నీరందించే పరిస్థితి లేకపోవడంతో సాగు నీరందించలేకపోతున్నారు. జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టు అయిన కోట్‌పల్లి ప్రాజెక్టుకు గత రెండు, మూడేండ్లుగా భారీగా వరద వస్తుండడంతోపాటు సంబంధిత ప్రాజెక్టు కింద ఉండే కాలువలన్నీ కొట్టుకుపోవడంతో కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి చాలా తక్కువ విస్తీర్ణంలో సాగు నీరందిస్తున్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టు ద్వారా తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల్లోని 18 గ్రామాలకు సాగునీరు అందించాల్సి ఉండగా, కాల్వలు పూర్తిగా దెబ్బతినడం, తూములు కొట్టుకుపోవడంతో కేవలం 2-3 గ్రామాలకు మాత్రమే సాగునీరందిస్తున్నారు. ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా రుద్రారం, గట్టేపల్లి గ్రామాలకు, కుడి కాలువ ద్వారా ఒక్క గ్రామానికి కూడా సాగు నీరందడం లేదు. తూములు, కాలువలు పూర్తిగా దెబ్బతినడంతో ఈ యాసంగికి సాగు నీరందించడం కష్టమేనని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు. 1.57 టీఎంసీల సామర్థ్యం గల కోట్‌పల్లి ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నా కాలువలు పూర్తిగా కొట్టుకుపోవడం, దెబ్బతినడంతో రైతులకు నష్టం జరగకూడదనే లక్ష్యంతో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునికీకరణకు సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో గత ప్రభుత్వం వెంటనే జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వి.ప్రకాశ్‌తోపాటు అధికారుల బృందాన్ని పంపి ఏయే పనులు చేపట్టాలనే సమగ్ర నివేదికను అందజేయాలని సూచించడంతోపాటు తదనంతరం కోట్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ కూడా ఇచ్చింది. అయితే రూ.110 కోట్ల నిధులతో కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునికీకరణతోపాటు ఆనకట్ట బలోపేతం, కుడి, ఎడమ, బేబీ కాలువల పునర్నిర్మాణం, కాలువల పునర్నిర్మాణం, పాత బ్రిడ్జిల స్థానంలో కొత్త బ్రిడ్జిలను నిర్మించడం తదితర పనులు చేపట్టేందుకు అంచనాలను తయారు చేశారు. అసెంబ్లీ ఎన్నికలు రావడంతో నిధుల విడుదలకు బ్రేక్ పడింది. తదనంతరం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నది. మరోవైపు ఎమ్మెల్యేలుగా ఎన్నికైన తాండూరు, వికారాబాద్ ఎమ్మెల్యేలు కోట్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతు పనులకు నిధులు తీసుకురావడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టు ద్వారా 9200 ఎకరాలకు(కుడి కాలువ ద్వారా 8100 ఎకరాలు, ఎడమ, బేబీ కాలువ ద్వారా 1100 ఎకరాలకు) సాగు నీరందించే సామర్థ్యం ఉన్న కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునీకీకరణ పనులు పూర్తైతే 15 వేల ఎకరాలకుపైగా సాగు నీరందించే అవకాశాలు ఉన్నట్లు జిల్లా నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టును కుడి కాలువ కింద ధారూరు మండలంలోని నాగసముందర్, అల్లాపూర్, రుద్రారం, బూర్గుగడ్డ, గట్టేపల్లి గ్రామాలు ఉండగా, ఎడమ కాలువ కింద పెద్దేముల్ మండలంలోని మాన్‌సాన్‌పల్లి, బుద్దారం, పెద్దేముల్, మారెపల్లి, దుగ్గాపూర్, రుక్మాపూర్, కొండాపూర్, ఖానాపూర్, రేగొండి, మదవంతాపూర్, జనగాం, మంబాపూర్, తింసాన్‌పల్లి గ్రామాలు ఉన్నాయి. బేబి కాలువ కింద నాగసముందర్, బూర్గుగడ్డ గ్రామాల ఆయకట్టుకు సాగునీరందించేలా నిర్మించారు.





### జిల్లాలో పేరుకుపోతున్న రెవెన్యూ సమస్యలు..

### 20 వేలకు చేరుకున్న కేసుల సంఖ్య

### ప్రజావాణిలో వస్తున్న సమస్యల్లో అత్యధికంగా రెవెన్యూవే..

# సమస్యలు పుట్టలుగా.. ఫైళ్లు కుప్పలుగా..

**రాష్ట్రంలోనే రెవెన్యూ పరమైన కేసుల్లో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉన్నది. హైదరాబాద్ చుట్టూ జిల్లా విస్తరించి ఉన్నందున భూ సమస్యలు విపరీతంగా పెరిగాయి. దీంతో కేసుల సంఖ్య కూడా పెరుగుతూనే ఉన్నది. జిల్లాలో పెద్ద ఎత్తున వస్తున్న పరిశ్రమలు, ఐటీ సంస్థలతో పాటు ఓఆర్ఆర్ వంటి ప్రాజెక్టులు రావడంతో శివారు ప్రాంతాల్లోనే భూముల ధరలు పెద్ద ఎత్తున పెరిగాయి. ఒక ఎకరం ధర రూ.కోటి మొదలుకుని రూ.20 కోట్ల వరకు చేరుకోవడంతో ఆయా భూములకు సంబంధించి వ్యక్తులు కూడా కేసులు వేస్తున్నారు. గతంలో అమ్మిన భూములపై కూడా తాము వారసులమంటూ కేసులు వేస్తున్నారు. ఇందులో మహిళలు కూడా ఉన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో అత్యధికంగా మండలాలు, మున్సిపాలిటీలు ఉండడం వల్ల వీటి పరిధిలో వెంచర్లు, భవన నిర్మాణాలు కూడా పెరిగిపోతున్నాయి. దీంతో తమకు ఎంతోకొంత వస్తుందన్న ఆశతో సంబంధం లేని వ్యక్తులు సైతం కేసులు వేస్తున్నారు. వీటికితోడు మ్యుటేషన్లు, పట్టామార్పిడిలు, 3080 వంటి కేసులు పెరిగాయి. ఇప్పటికే జిల్లాలో 20వేలకు పైగా రెవెన్యూ పరమైన కేసులు ఉండగా, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలోనూ అధిక సంఖ్యలో ఫిర్యాదులు వస్తుండడం విశేషం.**

- రంగారెడ్డి, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ)

### 20వేలకు పైగా రెవెన్యూ కేసులు..

జిల్లాలో సుమారు 20 వేలకు పైగా రెవెన్యూ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ల లాగిన్‌లలో ఈ కేసులు ఏండ్ల తరబడి మగ్గుతున్నాయి. కేసులు పరిష్కరించాల్సిన జాయింట్ కలెక్టర్ రెవెన్యూ పోస్టు గత ఆరు మాసాలుగా ఖాళీగా ఉండడమే కారణమని ఆరోపణలు ఉన్నాయి. గత సంవత్సరం ఆగస్టులో అప్పటి రెవెన్యూ జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డిని ఏసీబీ అధికారులు పట్టుకోవడంతో అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉన్నది. ప్రస్తుతం ఉన్న జాయింట్ కలెక్టర్ ప్రతిమాసింగ్ రెవెన్యూ, స్థానిక సంస్థల రెండింటి బాధ్యతలు మోస్తున్నారు. తమకున్న శాఖలతో సతమతమవుతున్న ఆమె అదనపు సమస్యలను చూసేందుకు సరైన సమయం దొరకడంలేదు. జిల్లాలో అత్యధికంగా మున్సిపాలిటీలు 13 ఉన్నాయి. వీటికి తోడు 2 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వీటి బాధ్యతతో పాటు, జిల్లావ్యాప్తంగా ఉన్న 549 గ్రామపంచాయతీల బాధ్యత కూడా ఆమెనే చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. దీంతో అదనపు బాధ్యతతో ఆమె రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించలేకపోతున్నారు. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలతో పాటు సివిల్‌సప్లయ్, ఎక్సైజ్ తదితర శాఖలకు సంబంధించి కేసులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో జిల్లాలో రెవెన్యూ పరమైన కేసులు ఏటేటా పెరగడం పరిష్కారానికి నోచుకోవడం లేదు.

### రెవెన్యూ జాయింట్ కలెక్టర్ పోస్టు ఖాళీ..

గత సంవత్సరం ఆగస్టులో రెవెన్యూ జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డిని ఏసీబీ అధికారులు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. అప్పటి నుంచి ఆయన స్థానంలో కొత్తవారికి అవకాశం లభించలేదు. ఆరు మాసాలుగా జాయింట్ కలెక్టర్ రెవెన్యూ పోస్టు ఖాళీగా ఉన్నందున రెవెన్యూ సమస్యలతో పాటు సివిల్‌సప్లయ్ వంటి సమస్యలు కూడా ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దరఖాస్తుదారులు మాత్రం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి..



జిల్లాలో గత ఆరు మాసాలుగా రెవెన్యూ సమస్యలు పెండింగ్‌లో ఉండడంతో రెవెన్యూ బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారానికి నాలాంటి మాజీ ప్రజాప్రతినిధులు కూడా కలెక్టర్ కార్యాలయం చుట్టూ పదేపదే తిరగాల్సిన పరిస్థితి నెలకొన్నది. వెంటనే జిల్లాలో రెవెన్యూ సంబంధిత కలెక్టర్‌ను నియమించి సమస్యలను పరిష్కరించాలి.

– కృపేశ్, మాజీ ఎంపీపీ

### నలుగురు కలెక్టర్ల బదిలీతో పెండింగ్‌లో రెవెన్యూ సమస్యలు..

జిల్లాలో గత సంవత్సర కాలంలో తరచుగా కలెక్టర్లు మారడం కూడా రెవెన్యూ పరమైన కేసుల పరిష్కారానికి అడ్డంకిగా మారింది. సంవత్సర కాలంలో హరీశ్, అమెయ్‌కుమార్, భారతి హోలికేరీ, శశాంకలు బదిలీ అయ్యారు. వీరు జిల్లాలో తక్కువ కాలం పని చేశారు. మరికొంత మంది రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించేలోపే బదిలీ అయ్యారు. దీంతో రెవెన్యూ సమస్యలు ఏండ్ల కొద్దీ పెండింగ్‌లోనే ఉన్నాయి. తరచూ కలెక్టర్లు మారడంతో, ధరణిలో వారు థంబ్‌పెట్టే లోపే బదిలీ ఆర్డర్లు రావడంతో కేసుల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది.



## కాంగ్రెస్‌లో కుమ్ములాట

**నందిగామ కార్యకర్తలను కొట్టిన పిట్టలగూడ కార్యకర్తలు**

నందిగామ, ఫిబ్రవరి 3 : రెండు గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు కుమ్ములాడుకున్నారు. నందిగామ, పిట్టలగూడ గ్రామాలకు చెందిన కార్యకర్తలకు ఆదివారం రాత్రి నందిగామలో మాటామాట పెరిగింది. నందిగామ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త, రౌడీ షీటర్ కుమ్మరి కృష్ణను పిట్టలగూడ గ్రామానికి చెందిన కార్యకర్తలు శ్రీశైలం, మహేందర్, ప్రవీణ్, ప్రమోద్, కృష్ణతోపాటు మరికొందరు విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారు. దీంతో కుమ్మరి కృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు నందిగామ సీఐ ప్రసాద్ తెలిపారు.